తుఫాన్ దెబ్బకు రైతన్న విలవిల



మాదివాడ ఆయకట్టులో కళ్లాలపై టార్పాలిన్ కప్పిన దృశ్యం



తుఫాన్ ప్రభావానికి పట్టుబడులు పడుతున్న రైతులు

- ప్రారంభమైన ఈదురుగాలులు, జల్లులు
- ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో నిమగ్నం

ఆకివీడు: తుఫాన్ హెచ్చరికతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నారు. శుక్రవారం రాత్రి నుంచి పలు చోట్ల చిరు జల్లులు పడటంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. గత వారం రోజులుగా వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతాంగం అప్రమత్తమైనప్పటికీ కొన్ని చోట్ల ధాన్యం బరకాలతో కప్పి ఉంచాల్సి వచ్చింది. గత నాలుగైదు రోజులుగా ధాన్యాన్ని ఎండబెడుతూ ఉన్నారు. యంత్రాలతో కోసిన ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉంది. కొన్ని చోట్ల తేమ శాతం 25 పైబడి ఉంటే, మరి కొన్ని చోట్ల 20 నుండి 25 శాతం తేమ ధాన్యాల్లో ఉంది. దీంతో తేమ ధాన్యాన్ని మిల్లులకు తోలితే మద్దతు ధరలో కటింగ్ వేస్తున్నారని రైతులు ధాన్యాన్ని ఆరబెడుతూ ఉంచారు. చాలా మంది రైతులు టార్పాలిన్‌లు కప్పి ధాన్యాన్ని భద్రపరిచారు. వర్షాలు విస్తృతంగా కురిస్తే కొంత మేర ధాన్యానికి నష్టం ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. సాధారణ వర్షం కురిసి తుఫాన్ ప్రభావం చూపకపోతే కష్టం నుంచి గట్టెక్కినట్లేనని చెబుతున్నారు.

తేమ తెస్తున్న తంటా

వరి కోతలు యంత్రాలతో చేయడం వల్ల ధాన్యంలో పచ్చి గింజ, తేమ ఉన్న గింజ అధికంగా వస్తుంది. 20 నుంచి 28 శాతం వరకూ తేమ శాతం పలు చోట్ల వివిధ రకాలుగా వస్తుంది. యంత్రాల మాసూళ్ల ధాన్యాన్ని నాలుగైదు రోజులు ఆరబెట్టాల్సి వస్తుంది. ఈ విధంగా ఆరబెట్టినా 20 శాతానికి తక్కువగా తేమ రావడం లేదని రైతులు వాపోతున్నారు. ధాన్యం ఆరబెట్టేందుకు అదనపు ఖర్చులు అవుతున్నాయంటున్నారు. సాధారణంగా కోత కోసి పనలపై ఉంచి, కుప్పలువేసి, దుక్కు దున్నిన ధాన్యంలో తేమ ఉండడం లేదని చెబుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ శాతం 16కు మించకూడదు. అయితే రైతుల వద్ద ఆ రకం ధాన్యం లేకపోవడంతో 20 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తున్నారు.

చల్లబడ్డ వాతావరణం

తుఫాన్ ప్రభావంతో శనివారం వాతవరణం చల్లబడింది. అయితే వర్షం ఉధృతి అధికంగా ఉండే అవకాశం ఉండటంతో రాశులపై ఉన్న ధాన్యాన్ని రైతులు పట్టుబడులు పట్టి మిల్లులకు చేరవేస్తున్నారు. తేమ శాతం 20 వరకూ ఉన్నప్పటికీ మిల్లుల్లో ధాన్యం తీసుకుంటున్నారని వ్యవసాయాధికారులు చెప్పడంతో రైతులు ముందుకు వచ్చి ధాన్యం పట్టుబడులు పడుతున్నారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారిణి ప్రియాంకల సమక్షంలో శనివారం రాశుల్లో ధాన్యాన్నిపట్టి సంచుల్లోకి ఎత్తి ట్రాక్టర్ల ద్వారా మిల్లులకు చేరవేస్తున్నారు.

నియోజకవర్గంలో వరి సాగు వివరాలు

మండలం	ఎకరాలు	కోత కోసింది	కళ్లాలపై ఉన్నధాన్యం
ఆకివీడు	1,980	275	70
కాళ్ళ	3,820	400	10
ఉండి	10,749	1729	180
పాలకోడేరు	11,400	4,350	250

అధిక శాతం మిల్లులకు చేరింది



నియోజకవర్గంలో కోత కోసిన ధాన్యం అధిక శాతం మిల్లులకు చేరుకుంది. రెండు మూడు రోజుల క్రితం కోతలు కోసిన ధాన్యంలో తేమ అధికంగా ఉందని రైతులు ఆరబెట్టుకుంటున్నారు. తుఫాన్ వల్ల వాటిని కూడా మిల్లులకు చేరవేయాలని సూచించాం. వాటిని రాసుల్లో భద్రపరుస్తున్నామని చెబుతున్నారు.

– కేఎస్ఎస్ శ్రీనివాసరావు, ఏడీఏ, ఆకివీడు

తుఫాన్ ముప్పు.. మళ్లీ వచ్చింది

రైతులను వణికిస్తున్న వర్షం

భీమవరం: బంగాళాఖాతంలో తుపాను కారణంగా జిల్లాలోని రైతులు అవస్థలు వర్ణణాతీతం. జిల్లాలోని 20 మండలాల పరిధిలో సార్వా సీజన్‌లో సుమారు 2.19 లక్షల ఎకరాల్లో వరినాట్లు వేశారు. ప్రస్తుతం మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో శుక్రవారం సాయంత్రం నుంచి చెదురుమదురు వర్షం కారణంగా రైతులు ఇప్పటికే గట్టుకు చేర్చిన ధాన్యాన్ని వర్షం బారి నుంచి కాపాడుకోడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో రైతులు ఎక్కువ మంది వరికోత యంత్రాలతోనే మాసూళ్లు చేస్తున్నారు. అయితే కోత యంత్రాలతో ఒబ్బిడి చేసిన ధాన్యంలో నింబు ఎక్కువగా ఉండడంతో తక్షణం ఎండబెట్టాల్సి ఉంటుంది. ధాన్యంలో తేమశాతం తగ్గేవరకు ఎండబెట్టకపోతే గింజలు రంగుమారి ముక్కపాయగా మారిపోతాయి. అటువంటి ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తారు. గత నాలుగైదు రోజులుగా గట్టుకు చేరిన ధాన్యాన్ని రైతులు రోడ్లువెంబడి, ఖాళీ ప్రదేశాల్లో ఎండబెడుతున్నారు. ఇటువంటి తరుణంలో శుక్రవారం సాయంత్రం నుంచి కొన్నిప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షం కురువగా శనివారం తెల్లవారు జాము నుంచి జిల్లా వ్యాప్తంగా వర్షం పడింది. దీనితో గట్టుకు చేర్చిన ధాన్యం తడిచిపోకుండా బరకాలు కప్పి రక్షణ కల్పిస్తున్నారు. అయితే రెండు రోజులుపాటు తేమ శాతం ఎక్కువ ఉన్న ధాన్యాన్ని బరకాలతో కప్పి ఉంచితే రంగుమారి ముక్కపాయ వచ్చే ప్రమాదముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కొన్నిచోట్ల వర్షం , గాలులు కారణంగా చేను చుడులుతిగిరి పడిపోవడంతో దిగుబడిపై ప్రభావం చూపడమేగాక పడిపోయిన పంటను మాసూళ్లు చేయడానికి ఎక్కువ ఖర్చు అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజులుపాటు వాతవరణం ఇలాగే ఉంటే తీవ్రనష్టాలను చవిచూడాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం కారణంగా శుక్ర, శనివారాలు మాసూళ్లు నిలిచిపోవడంతో వర్షాలు తగ్గిన అనంతరం అంతా ఒకేసారి పొలంబాట పడితే కూలీల కొరత, కోత యంత్రాలకు మరింత డిమాండ్ ఏర్పడి మాసూళ్ల ఖర్చులు పెరిగిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వర్షానికి పడిపోయిన సార్వా వరిచేను



వర్షం కారణంతో గట్టుకు చేర్చిన ధాన్యాన్ని బరకాలతో రక్షణ కల్పిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

పోలీసు ఉద్యోగులకు సత్కారం



పదవీ విరమణ చేసిన పోలీసు ఉద్యోగులను సత్కరిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: పోలీసుశాఖలో సుదీర్ఘకాలం ప్రజలకు వెలకట్టలేని సేవలందించిన సిబ్బంది పదవీ విరమణ అనంతరం శేష జీవితం మంచి ఆరోగ్యంతో ఆనందంగా గడపాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. భీమవరం సీసీఎస్ ఎస్ఐగా పనిచేసిన లక్ష్మణ్‌కుమార్, డీసీఆర్‌బీ ఎస్ఐ వి వరప్రసాద్, పెనుగొండ పోలీసుస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేసిన సూర్యారావులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి భీమారావు, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎంవీవీ సత్యనారాయణ, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి పుల్లారావు, డీసీఆర్‌బి ఇన్‌స్పెక్టర్ దేశింశెట్టి వెంకటేశ్వరరావు, పోలీసు అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ సీహెచ్ మోజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి పోరాటంతో ఎయిడ్స్ అంతం



వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్ వ్యాధి నివారణపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: ఆధునిక యుగంలో ఎయిడ్స్ వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తతో ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత పిలుపునిచ్చారు. ఎయిడ్స్ వ్యాధి నివారణపై అవగాహనా వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రంగోలీ పోటీలు, ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువత ముందుచూపుతో వ్యవహరించాలన్నారు. భవిష్యత్ ప్రణాళికలపై దృష్టి పెట్టాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ సమన్వయకర్త డాక్టర్ టి.ఓగేశ్వరరావు, అధ్యాపకులు కె.శ్యామ్యూల్, డాక్టర్ ఇందిర, జి.సంజీవరాజు, యు.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అంజిబాబుకు అభినందనలు



భీమవరంలో ఎమ్మెల్యే అంజిబాబును సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: ప్రజాసేవలో అంకితభావంతో పని చేసే వ్యక్తికే సముచిత స్థానం రాష్ట్ర ప్రభుత్వం అందించిందని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అండ్ అన్ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్ మెంట్ అసోసియేషన్(అపుస్మా) జిల్లా అధ్యక్షుడు అక్కినేని కృష్ణకిషోర్, వైస్ ప్రెసిడెంట్ ఎంఎల్ఎస్ఎన్ రెడ్డి అన్నారు. భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా శనివారం అపుస్మా ఆధ్వర్యంలో అంజిబాబుకు శాలువా కప్పి చిత్రపటంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చేబ్రోలు నాగేశ్వరరావు, వంశీ కృష్ణ, కోశాధికారి సూర్య ప్రకాష్, పాలకొల్లు జోన్ ప్రెసిడెంట్ షాజహాన్, మండల అధ్యక్షుడు జాన్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో అధికారుల పర్యటన



ఉండిలో పీహెచ్‌సీలో అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రవీంద్ర

ఉండి: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు అత్యున్నతంగా సేవలు అందించాలని ఉండి, యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రత్యేకాధికారులు ఎస్.రవీంద్ర, కె.నాగార్జున అన్నారు. ఉండి పీహెచ్‌సీకి ప్రత్యేకాధికారిగా ఎంపీడీఓ ఎస్.రవీంద్ర, యండగండి పీహెచ్‌సీకి తహసీల్దార్ కె.నాగార్జున నియమితులైన సందర్భంగా శనివారం ఆయా పీహెచ్‌సీలను వారు పరిశీలించి అధికారులు, సిబ్బందితో సమావేశమైయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీహెచ్‌సీల్లో సదుపాయాలన్నీ రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సీహెచ్ సాయిచంద్ర, డాక్టర్ డి.బెన్నీ సామ్యూల్, సీహెచ్ఓ ఆర్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి

భీమవరం: డిసెంబర్ 1వ తేదీ హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ నందు జరుగు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి బహిరంగ సభను విజయవంతం చేయాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ పిలుపునిచ్చారు. భీమవరంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన శనివారం మాట్లాడారు. దళిత సంఘాలు ఏకమై చేస్తున్న ఉద్యమంలో బహిరంగ సభను విజయవంతం చేసి మాలల సత్తా ఏంటో చూపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నన్నేటి నాగరాజు, ఇంటి సుందర్ కుమార్, కొలటి ప్రసాద్, నేతల సాల్మన్ రాజు, సత్యనారాయణ, బుజ్జి, రామారావు పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి



టి.రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం: తుపాను ప్రభావం దృష్ట్యా రైతులు రాబోయే రెండు రోజుల్లో వరి కోతలు వాయిదా వేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సూచించారు. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని సురక్షితమైన ప్రాంతాలకు తరలించుకోవాలని సూచించారు. ధాన్యం తడిస్తే మొలకరాకుండా 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికా చేసుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రం ద్వారా కనీస మద్దతు ధర్‌పై తేమ శాతానికి అనుగుణంగా ధాన్యాన్ని అమ్ముకోవడానికి వీలు కల్పించామని తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని నెంబర్లు 8121676653/ 18004251291 కి కాల్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు.

వ్యక్తిపై దాడి

భీమవరం: మోటార్ సైకిల్‌పై ఎందుకు అంత వేగంగా వెళుతున్నారని ప్రశ్నించిన వ్యక్తిపై దాడి చేసినట్లు భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఎ.సుబ్రహ్మణ్యం శనివారం ఫిర్యాదు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ ఎస్ఐ వి.వి.ఎస్ కృష్ణాజి చెప్పారు. హౌసింగ్ బోర్డు కాలనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం శుక్రవారం రాత్రి ఆర్టీసీ డిపో దగ్గర రోడ్డుపై నిలబడి ఉండగా నలుగురు వ్యక్తులు రెండు మోటార్ సైకిళ్లపై వేగంగా వెళుతుంటే ప్రశ్నించిన సుబ్రహ్మణ్యంపై దాడి చేసినట్లు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా కార్తీక లక్ష దీపోత్సవం

భీమవరం: పట్టణంలోని జె.పి రోడ్డులోని పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక మాసం శనివారం కార్తీక లక్ష దీపోత్సవం నిర్వహించారు. ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు, ఆలయ చైర్మన్ మంతెన రామ్ కుమార్ రాజు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో లక్ష దీపోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

దాతల సేవలు సద్వినియోగం చేసుకోవాలి



రాయలం గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌కు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: దాతల సేవలను అంగన్‌వాడీ కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలని మిత్ర ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మీరెడ్డి అన్నారు. భీమవరం మండలంలోని రాయలం, యనమదుర్రు అంగన్‌వాడీ సెంటర్లకు స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో విద్యాసామగ్రిని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అప్‌గ్రేడైన 60 అంగన్‌వాడీ సెంటర్లకు ఈ ఉపకరణాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రైవేట్ ప్లే స్కూల్‌కి తీసుకోకుండా ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్లను నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ హెచ్ఆర్ మోహన్ బాబా, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ టీకేవీ లక్ష్మీకాంతం, సూపర్‌వైజర్ అనిలా, సీహెచ్ మహాలక్ష్మి, జీవివి కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు

కేంద్రమంత్రికి పలువురి పరామర్శ



కేంద్రమంత్రి శ్రీనివాసవర్మను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

భీమవరం: కేంద్ర ఉక్కు, భారీపరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను శనివారం రాష్ట్ర మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పరామర్శించారు. శ్రీనివాసవర్మ నివాసానికి వచ్చిన కారుమూరి సూర్యనారాయణరాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాసవర్మ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే కేంద్ర ఉక్కు, భారీపరిశ్రమల సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మను శనివారం అపుస్మా అసోసియేషన్ నాయకులు పరామర్శించారు. అపుస్మా జిల్లా అధ్యక్షుడు అక్కినేని కృష్ణషోర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎల్ఎస్ఎన్ రెడ్డి, నర్సింహరాజు, చేబ్రోలు నాగేశ్వరరావు, వంశీ, ప్రకాష్ తదితరులు శ్రీనివాసవర్మను కలిసి తీవ్ర సంతాపం తెలిపారు.

స్నేహభావానికి వన సమారాధనలు దోహదం



ఆకివీడు: కాటన్ పార్కులో కార్తీక వనసమారాధనలో వడ్డిస్తున్న తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు



బొండాడ ఆలయంలో వనసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: కార్తీక వనసమారాధనలు స్నేహభావాన్ని, సోదర భావాన్ని పెంపొందించడానికి దోహదం చేస్తాయని తహసీల్దార్ ఎస్. వెంకటేశ్వరరావు చెప్పారు. కార్తీకమాసం సందర్భంగా స్థానిక కాటన్ పార్కులో శనివారం మండల అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉసిరి మొక్కకు తహసీల్దార్ పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యంత్రాంగం అంతా ఒక చోట చేరుకుని సంతోషకర వాతావరణంలో గడపడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ జీ.కృష్ణ మోహన్, ఎంపీడీఓ సుహాసినీ, సూపరింటెండెంట్ శ్రీకర్, వ్యవసాయాధికారిణి ప్రియాంక, ట్రాన్స్ కో ఏఈ ప్రసాదరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వి.ఆంజనేయులు పాల్గొన్నారు.

బొండాడలో..

కాళ్ల: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని మండలంలోని బొండాడ గ్రామంలో ఉన్న శ్రీ పార్వతీ సమేత భోగేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత జనార్ధన స్వామి ఆలయాల ప్రాంగణంలో శనివారం వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆలయ ప్రాంగణంలో ఉన్న ఉసిరిచెట్టుకు పూజలు నిర్వహించి, పలు రకాల పిండి వంటలతో స్వామి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. గ్రామస్తులు, దాతలు సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మన్నే నాగరాజు, మాజీ ఎంపీపీ కందుల మల్లికార్జునరావు, మన్నే శ్రీనివాసరావు, కందుల హనుమ, పెన్మెత్స రంగరాజు, మన్నే సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

పెనుగొండ: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని సత్వరం విరమించుకోవాలని వైఎస్సార్ సీజీ రాష్ట్ర యువజన కార్యదర్శి కొవ్వూరి వేణు మాధవ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పెనుగొండలో విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీలు పెంచబోమని ఊదరగొట్టిన చంద్రబాబు, ఆరు నెలల్లో రెండు సార్లు చార్జీల మోత వేసి రూ.15,486 కోట్లు భారం మోపారన్నారు. విద్యుత్ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టిన ఘనత బాబుదే నన్నారు. ఇప్పటికే దారుణంగా మండుతున్న నిత్యావసర ధరలు బాదుడితో సామాన్యుడి బతుకు భారంగా మారిందన్నారు. గాడి తప్పిన పాలనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ తరుణంలో విద్యుత్ భారం ప్రజలపై మోపడం సరికాదన్నారు. విద్యుత్ చార్జీలు పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రత్యేక కౌంటర్ల ద్వారా పామాయిల్, ఉల్లిపాయల విక్రయాలు

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రత్యేక కౌంటర్ల ద్వారా పామాయిల్, ఉల్లిపాయలు విక్రయించేందుకు చర్యలు చేపట్టినట్లు పౌర సరఫరాల అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పామాయిల్ 850 గ్రాముల ప్యాకెట్ రూ.110, ఉల్లిపాయలు కిలో రూ.50 చొప్పున విక్రయిస్తామన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల వద్ద రైస్ కార్డు నెంబర్ తెలియచేసి, క్యూ ఆర్ కోడ్‌ను స్కానం చేయాలన్నారు. తద్వారా మొబైల్‌కు వచ్చే ఓటీపీని కౌంటర్ వద్ద తెలియజేసి మూడు పామాయిల్ ప్యాకెట్లు, ఒక కిలో ఉల్లిపాయలు పొందవచ్చన్నారు. అదే విధంగా కందిపప్పును ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కార్డుదారులకు పంపిణీ చేస్తామన్నారు.

పోలీసు కుటుంబానికి చెక్కు పంపిణీ



భీమవరం ఎస్పీ కార్యాలయంలో చెక్‌ను అందిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: అనారోగ్యంతో మరణించిన ఏఎస్ఐ డి పీటర్ కుటుంబానికి శనివారం రూ.లక్ష చెక్కును ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అత్తిలి ఏఎస్ఐగా పనిచేస్తున్న పీటర్ ఇటీవల అనారోగ్య సమస్యలతో మరణించారు. దీనితో ఆయన కుమారుడు విద్యాసాగర్‌కు ఎస్పీ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి భీమారావు, జిల్లా పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ మోజేష్ పాల్గొన్నారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం



కాళ్ల: అరుణోదయ మనో వికాస కేంద్రంలో ఆటల పోటీల్లో పాల్గొన్న విభిన్న ప్రతిభావంతులు

కాళ్ల: మానసిక వికాసం కల్పించడానికి క్రీడలు ఎంతో సహకరిస్తాయని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, అరుణోదయ మనోవికాస కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం డైరెక్టర్ చింతలపాటి అరుణాదేవి మాట్లాడుతూ గత 29 ఏళ్లుగా కేంద్రం నిర్వహిస్తున్నామని, ఈ బాలల్లో ఎంతో చైతన్యం వచ్చిందని, మాకు సంఘ సేవకులు రంగసాయి సహకరిస్తున్నారని అన్నారు. లయన్స్ క్లబ్ పూర్వాధ్యక్షుడు నందమూరి రాజేష్, మానవతా సేవాసంస్థ కార్యదర్శి కారుమూరి చినబాబు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, యర్రా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఉండి: దివ్యాంగురాలు వెంకటపద్మజకు వీల్‌చైర్ అందిస్తున్న మానవత ప్రతినిధులు

వెనుకబడిన వారికి అండగా మానవత

ఉండి: సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి మానవత స్వచ్ఛంధసేవా సంస్థ అండగా ఉంటుందని సంస్థ మండల అధ్యక్ష, కార్యదర్శులు పెన్మత్స రామకృష్ణంరాజు, డాక్టర్ గాదిరాజు రంగరాజు అన్నారు. శనివారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఉండిలో దివ్యాంగురాలు తాడేపల్లి వెంకటపద్మజకు రూ.12 వేల విలువైన వీల్ చైర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మానవతా ప్రతినిధులు మాట్లాడుతూ మావనతా సేవాసంస్థ ద్వారా మండల వ్యాప్తంగా విశేష సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కో–చైర్మన్ దంగేటి రామలింగేశ్వరరావు,కన్వీనర్ కొమ్మన నాగబాబు, కోశాధికారి కట్రెడ్డి సత్యనారాయణ, మాసాబత్తుల రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.